సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

7

శుక్రవారం । 13 । డిసెంబర్ । 2024



సీతాలు సందడి

గిరిజన సంప్రదాయంలో సీతాలు పండగను గురువారం మండలంలోని సాగర పంచాయతీ అడవవలసలో ఘనంగా నిర్వహించారు. వరి కల్లాం వద్ద పంట నూర్పులు చేసి ధాన్యాన్ని రాశిగా ఏర్పాటుచేసి పూజలు నిర్వహించారు. బంధువులను ఆహ్వానించి భోజనాలు ఏర్పాటుచేశారు. – డుంబ్రిగుడ

న్యూస్‌రీల్

మార్చి 17 నుంచి టెన్త్ పరీక్షలు

- హాజరుకానున్న 11,963 మంది విద్యార్థులు
- జిల్లావిద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు

పాడేరు రూరల్ (అరకులోయ రూరల్): ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించి టెన్త్ పరీక్షలు మార్చి 17 నుంచి 31 వరకు జరుగుతాయని జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా 11,963 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని ఆయన పేర్కొన్నారు. 17న ఫస్ట్ లాంగ్వేజ్, 19న సెకండ్ లాంగ్వేజ్, 21న ఇంగ్లీష్, 22న సంస్కృతం, పర్షియన్, అరబిక్, 24న మ్యాథ్స్, 26న ఫిజికల్ సైన్స్, 28న బయోలాజికల్ సైన్స్, 29న (సంస్కృతం, పర్షియన్, అరబిక్) పేపర్ –2, ఒకేషనల్ కోర్సు, 31 సోషల్ పరీక్ష జరుగుతుందని డీఈవో వివరించారు.

చలి చంపేస్తోంది

- తగ్గుతున్న ఉష్ణోగ్రతలు
- వణుకుతున్న గిరిజనులు



లంబసింగి సమీపంలో చిత్రాలగొప్పు వద్ద కురుస్తున్న మంచు

చింతపల్లి: మన్యంలో కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతుండటంతో చలి ప్రభావం ఎక్కువగా ఉంటోంది. జి.మాడుగులలో 14.1, ముంచంగిపుట్టులో 14.2 డిగ్రీలు నమోదైనట్టు స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. పాడేరు డివిజన్‌లోని పెదబయలు, అనంతగిరిలో 14.3, అరకు వ్యాలీలో 14.9, డుంబ్రిగుడలో 15.1, పాడేరులో 15.7, హుకుంపేటలో 15.8, చింతపల్లిలో 16.0, గూడెంకొత్తవీధిలో 16.8 డిగ్రీలు నమోదు అయినట్టు ఆయన వివరించారు.

జామిగుడ రోడ్డును అందుబాటులోకి తెస్తాం

- పీఆర్ ఈఈ కొండయ్యపడాల్

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి,పాడేరు: పెదబయలు మండలం మారుమూల జామిగుడ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని పంచాయతీరాజ్ ఈఈ టి.కొండయ్యపడాల్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 'నిధులున్నా నిర్లక్ష్యం' శీర్షికన గురువారం సాక్షిలో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. మెట్టగుడ సమీపంలోని మినీ బ్రిడ్జి నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసి ఆంధ్రా–ఒడిశా రాష్ట్రాలకు రహదారి సౌకర్యం కల్పిస్తామన్నారు. ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు 20 రోజుల్లో పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలు రహదారి నిర్మాణ పనుల జాప్యానికి కారణమన్నారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని ఈఈ పేర్కొన్నారు.

గంజాయి రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

- ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా



గంజాయి వ్యవహారంపై మాట్లాడుతున్న ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా

చింతూరు: గంజాయి అక్రమ రవాణాకు పాల్పడినా, గంజాయి పండించినా కఠినచర్యలు తీసుకుంటామని చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా హెచ్చరించారు. గురువారం తన కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గంజాయి రవాణాపై గట్టినిఘా ఏర్పాటు చేయడంతోనే కూనవరం మండలం జంక్షన్ వద్ద రూ.50 లక్షల విలువైన వెయ్యి కిలోల గంజాయిని పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. కొనుగోలు చేసిన గంజాయిని నిత్యం రవాణా చేసే మోతుగూడెం మార్గంలో కాకుండా ఒడిశాలోని మోటు నుంచి చింతూరు, కూనవరం మండలాల మీదుగా ఉత్తరప్రదేశ్‌కు తరలిస్తున్న క్రమంలో గంజాయి పట్టుబడినట్లు ఆయన తెలిపారు. గంజాయి సాగును అరికట్టడంతో పాటు రవాణాపై దృష్టి సారించేందుకు డ్రోన్ల సాయంతో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశామని ఏఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎటపాక సీఐ కన్నపరాజు, కూనవరం ఎస్ లతాశ్రీ పాల్గొన్నారు.

జగన్ పాలనలో ఎంతో మేలు



జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వ్యవసాయానికి ఎంతో మేలు జరిగింది. మూడు దఫాలుగా రైతు భరోసా సొమ్ము రూ.13,500 చొప్పున పొందాను. ఖరీఫ్‌లో వరి, ఇతర పంటల సాగుకు పెట్టుబడి ఇబ్బందులు ఉండేవి కావు. చంద్రబాబు రైతు భరోసా ఊసెత్తకపోవడం చాలా బాధాకరం. కూటమి ప్రభుత్వంలో పేదలకు ఆసరా కరువైంది.

– పలాసి విసన్న, రైతు, కుంతర్ల, పెదబయలు మండలం

కానరాని ఉచిత బస్సు ప్రయాణం




ఎన్నికల మేనిఫెస్టోలో టీడీపీ సూపర్‌సిక్స్ పథకాల్లో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పేరిట ప్రచారం చేసింది.చంద్రబాబు సీఎం అయ్యి ఆరు నెలలు కావస్తున్నా ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం హామీ అమలు చేయలేదు. ఇచ్చిన హామీని అమలు చేస్తారా.. లేదా అనేది తెలియడం లేదు.

– బురిడి రాధ, గిరిజన మహిళ, పెద్ద గంగగుడి,అరకులోయ మండలం

గిరి రైతును దగా చేసిన కూటమి ప్రభుత్వం

ఏదీ ధైర్యం.. భరోసా





1,69,264 మంది రైతులకు దక్కని పెట్టుబడి సాయం

- అంతులేని హామీలు ఇచ్చి ఏఒక్కటీ అమలు చేయని దగా సర్కారు
- ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- అన్నివర్గాలను నమ్మించి నిలువునా ముంచిన బాబు
- ఏఒక్క హామీని అమలు చేయకుండా దాటవేత ధోరణితో కాలక్షేపం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పథకాలన్నింటినీ నిలిపివేసి పేదలకు అన్యాయం
- మహిళల ఉచిత బస్సు ప్రయాణం ఊసెత్తని చంద్రబాబు
- తల్లికి వందనం, నిరుద్యోగ భృతి అమలుపై మీనమేషాలు

సాక్షి,పాడేరు: గిరిజన రైతాంగానికి కూటమి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసింది. ఆరు నెలల పాలనలో వారి సంక్షేమాన్ని పట్టించుకున్న దాఖలాలు లేవు. ఎన్నికల ముందు అన్నదాత సుఖీభవ పేరుతో ఏడాదికి రూ.20వేలు పెట్టుబడి సాయం ప్రకటించిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీని పట్టించుకోలేదు. దీంతో ఖరీఫ్‌లో 1,69,264 మంది రైతులు నిరాశకు గురయ్యారు. అధిక వడ్డీకి సాగు పెట్టుబడికి తెచ్చిన రైతులు అప్పులపాలయ్యారు. కనీసం బ్యాంకుల నుంచి కూడా రుణాలు అందలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా పథకంలో ఏటా **రూ.13,500 చొప్పున జిల్లాలోని 1,69,264మందికి** రూ.228కోట్ల 5లక్షల 64వేల పెట్టుబడి సాయం అందించారు. నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేశారు. వ్యవసాయ రంగానికి ఎంతో మేలు చేశారు. ఈ పరిస్థితుల్లో ఆచరణ సాధ్యం కాని హామీలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం అన్నదాత నోట్లో మట్టి కొట్టింది. అన్నదాత సుఖీభవ పేరిట ప్రకటన చేసినప్పటికీ ఆరు నెలల కాలంలో నయా పైసా సాయం అందించలేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం తీరుపై వారంతా మండిపడుతున్నారు.

- ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్ అమలుజేస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం ఆచరణలో విఫలమైంది. ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ, ఇతర రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆందోళనతో సర్కార్ దిగి వచ్చింది. ఉచిత **గ్యాస్ సిలిండర్‌**ను మొదటి విడత సిలిండర్‌ను మార్చిలోగా అందజేస్తామని చెబుతోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో రెండు గ్యాస్ సిలిండర్లకు ఎగనామం పెట్టింది.
- ప్రతి మహిళకు రూ.1500 చొప్పున ఇంట్లో ఎంతమంది ఉంటే అందరికి ప్రతినెలా ఆర్థిక సాయం అందిస్తామని కూటమి ప్రభుత్వం ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. ఈ పథకంలో జిల్లాలో 3,96,969 మంది మహిళలు లబ్ధి పొందాల్సి ఉంది. వీరికి నెలకు రూ.59 కోట్ల 54లక్షల 53వేల 500 ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. బడ్జెట్‌లో ఈ పథకం ప్రస్తావనే లేదు.
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కూడా కూటమి ప్రభుత్వం తుస్సుమనిపించింది. జిల్లాలో 5,55,503 మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణానికి అర్హులు. వీరంతా కూటమి ప్రభుత్వం మాటలు నమ్మి మరోసారి మోసపోయారు.
- గత ప్రభుత్వం అమ్మఒడి పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలుజేసింది. ఈ పథకాన్ని కాపీ కొట్టిన కూటమి సర్కార్ సూపర్‌సిక్స్‌లో అమ్మకు వందనం పేరిట చేర్చింది. ప్రతీ కుటుంబంలో బడికి వెళ్లే పిల్లలందరికీ ఒకొక్కరికి రూ.15 వేల చొప్పున తల్లుల ఖాతాల్లో జమచేస్తామని ప్రకటించింది. విద్యాసంవత్సరం ప్రారంభమై ఆరు నెలలు కావస్తున్నా చంద్రబాబు పట్టించుకోలేదు. దీనివల్ల జిల్లాలో 1,73,935 మంది విద్యార్థుల తల్లులపై ఫీజుల భారం పడింది. ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి వారందరికీ రూ.260 కోట్ల 84లక్షల 55 వేలు చెల్లించాల్సి ఉంది.
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్నదాత సుఖీభవ పథకంతో ప్రతి గిరిజన రైతుకు ఏడాదికి రూ.20వేల ఆర్థిక సాయం అందజేస్తామని ప్రకటించింది. దీంతో ఆశపడిన జిల్లాలోని 1,69,264 మంది గిరిజన రైతులు దగాకు గురయ్యారు.
- సూపర్‌సిక్స్ హామీలో నిరుద్యోగులకు భృతి కల్పిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలో 2,97,091మంది యువతీ యువకులు ఉన్నారు.వారందరికి నెలకు రూ.3వేల చొప్పున కూటమి ప్రభుత్వం రూ.89 కోట్ల 42 లక్షల 76 వేలు ప్రతి నెలా చెల్లించాల్సి ఉంది.ఈ పథకాన్ని అమలు చేయడంలో మీనమేషాలు లెక్కిస్తోంది.

మహిళలకు రక్షణ కరువు

కూటమి పాలనలో మహిళలు, బాలికలకు రక్షణ కరువైంది. డిసెంబర్ ఐదున పాడేరులోని ఏకలవ్య పాఠశాలలో ఏడవ తరగతి విద్యార్థిని అఘాయిత్యానికి గురైంది. అదే పాఠశాలలో పనిచేస్తున్న ల్యాబ్ అసిస్టెంట్ అఘాయిత్యానికి పాల్పడ్డాడు.

కూటమి మోసాలపై పోరాటం



కూటమి ప్రభుత్వం అమలు కాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ప్రజలకు తీవ్ర అన్యాయం చేసింది. గిరిజన ప్రాంతాల ప్రజలు కూడా మోసపోయారు. సూపర్‌సిక్స్ పథకాల పేరిట అన్నివర్గాలను కూటమి నేతలు మోసం చేశారు. రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వలేదు. వారు ఆర్థికంగా నష్టపోయినా పట్టించుకోలేదు. అరకు పర్యటనలో జీవో నంబరు3ను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్నా కనీసం పట్టించుకోలేదు. మెగా డీఎస్సీ కాస్తా గిరిజనులకు దగా డీఎస్సీగా మారింది. గిరిజన సంక్షేమాన్ని ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. అన్నివర్గాలకు న్యాయం జరగాలన్న డిమాండ్‌తో కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ పోరాడుతుంది.

– మత్స్యరాస విశ్వేశ్వరరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే

అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ

- పాడేరులో నేడు రైతులతో పోరుబాట
- కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ, ధర్నా

సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా కేంద్రం పాడేరులో అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ కార్యక్రమం జరగనుంది. ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు,పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి గిరిజన రైతులు భారీగా ఈ కార్యక్రమానికి తరలిరానున్నారు.అరకు ఎంపీ, ఉమ్మడి విశాఖ జడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నేతలు,కార్యకర్తలు,పార్టీ అనుబంధ విభాగాల ప్రతినిధులు,మహిళలు,రైతులంతా ఉదయం 10గంటలకు పాడేరులోని తన క్యాంపు కార్యాలయానికి చేరుకోవాలని ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు కోరారు.

కార్యక్రమం ఇలా..

- ఉదయం 11గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి రైతులతో ర్యాలీ ప్రారంభం
- సినిమాహాల్ సెంటర్,ఆర్టీసీ కాంప్లెక్స్, తలారిసింగి జంక్షన్ మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహణ
- కలెక్టర్ కార్యాలయం ఎదుట రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణుల ధర్నా
- రైతుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలనే డిమాండ్‌తో కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పణ

అమ్మకు వందనమేదీ?



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మాట తప్పింది. బడికి వెళ్లే పిల్లలు ఎంతమంది ఉన్నా వారందరికి రూ.15వేల చొప్పున అమ్మకు వందనం పేరిట ఆర్థిక సాయం అందిస్తామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు ప్రకటించారు. నాకు ఐదుగురు పిల్లలు ఉన్నారు. వీరందరికీ రూ.75 వేలు చెల్లించాల్సి ఉంది. ఇంతవరకు ఒక్క పైసా కూడా ఇవ్వలేదు.

– ముత్యాల లక్ష్మి, విద్యార్థి తల్లి, కూనవరం

పంచనామాలో విలువైన కలప, ఫర్నిచర్ గుర్తింపు

- అటవీశాఖ రేంజ్ అధికారి విజయలక్ష్మిపై చర్యలు తీసుకోవాలి
- బీజేపీ నేతల డిమాండ్



పంచనామా నిర్వహిస్తున్న అధికారులు



వ్యానులో తరలిస్తున్న టేకు, జిట్రేగి కలప ఫర్నిచర్

ఎటపాక: కూనవరం అటవీశాఖ రేంజర్‌గా పనిచేసిన మోహిని విజయలక్ష్మి తీరు తీవ్ర చర్చనీయాంశమైంది. బుధవారం రాత్రి ఆమెకు చెందిన ఫర్నిచర్‌ను తరలిస్తున్న వ్యానును బీజేపీ జిల్లా నాయకులు పాయం వెంకయ్య, కొంతమంది గిరిజనులు నందిగామ వద్ద అడ్డుకోవడం తెలిసిందే. కలప తరలిస్తున్న సమాచారాన్ని ఉన్నతాధికారులకు వారు తెలియజేయడంతో వ్యానును నెల్లిపాక రేంజ్ కార్యాలయానికి తరలించారు. గురువారం ఉదయం సబ్ డీఎఫ్‌వో రాఘవరావు, కూనవరం రేంజర్ కరుణాకర్ సమక్షంలో వ్యానులోని సామగ్రిని కిందికి దించి పంచనామా నిర్వహించారు. సోఫా సెట్లు, డ్రెస్సింగ్ టేబుళ్లు, కింగ్ సైజ్ మంచాలు తదితర 30 రకాల విలువైన ఫర్నిచర్‌తో పాటు జిట్రేగి, టేకు కలప కూడా ఉన్నట్లు గుర్తించారు. కూనవరంలో రేంజర్‌గా పనిచేసిన సమయంలో ఇంత ఫర్నిచర్‌ను కూడబెట్టిన రేంజర్ తీరుకు వారంతా విస్తుపోయారు. అయితే సొంత శాఖ అధికారిణిని కాపాడేందుకు ఆ శాఖ అధికారులు తాత్సారం చేస్తూ పంచనామా వివరాలు వెల్లడించకుండా, కేసును నీరుగార్చే విధంగా వ్యవహరిస్తున్నారని బీజేపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ విధులు నిర్వహించే సమయంలో అవినీతికి పాల్పడిన మోహిని విజయలక్ష్మిని ఎట్టి పరిస్థితుల్లో విడిచిపెట్టవద్దని, ఇప్పటికే మూడుసార్లు వ్యాన్లలో తిరువూరుకు కలప సామగ్రిని తరలించిన ఆమెపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై అటవీశాఖ మంత్రి పవన్‌కల్యాణ్‌ను కలుస్తామని నాయకులు చెబుతున్నారు. దీనిపై కూనవరం రేంజర్ కరుణాకర్‌ను వివరణ కోరగా పంచనామా నిర్వహించిన ఫర్నిచర్‌కు సంబంధించి రేంజర్ కుటుంబసభ్యులు బిల్లులు సమర్పించారన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. తదుపరి విచారణను వారు చేపడతారని ఆయన వివరించారు.

రెవెన్యూ సదస్సులకు ఏర్పాట్లు పూర్తి

- నేటి నుంచి వచ్చేనెల 10 వరకు 2,969 చోట్ల నిర్వహణ
- జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ్



పాడేరు రూరల్ (అరకులోయ రూరల్): రెవెన్యూ సదస్సులు ఈనెల 13 నుంచి వచ్చేనెల 10 వరకు రెవెన్యూ సదస్సుల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 2,969 సదస్సులు ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహిస్తామన్నారు. భూ సమస్యలు, మ్యుటేషన్లు, ఇతర రెవెన్యూ సమస్యలపై రైతులనుంచి వినతులు స్వీకరిస్తామన్నారు. సదస్సుల పర్యవేక్షణకు సంబంధించి డివిజన్, జిల్లాస్థాయిలో బృందాలు ఏర్పాటుచేశామన్నారు. తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, వీఆర్వోలు, అటవీశాఖ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు రెవెన్యూ సదస్సులకు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. మ్యుటేషన్ ప్రక్రియ ఉచితంగా చేస్తారని, ఎటువంటి ఫీజు, డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు.

త్వరితగతిన రహదారుల నిర్మాణం

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశం



జామిగూడ వంతెన పనులపై అధికారులతో మాట్లాడుతున్న పీవో అభిషేక్



తమలంలో గిరిజనులతో మాట్లాడుతున్న పీవో అభిషేక్

పెదబయలు: రహదారుల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయాలని పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదేశించారు. గురువారం ఆయన మండలంలోని మారుమూల గిరిజన గ్రామాల్లో పర్యటించారు. గిన్నెలకోటలో జరుగుతున్న హైలెవెల్ వంతెనను పరిశీలించారు. వచ్చే సంక్రాంతి నాటికి వంతెన నిర్మాణం పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అదనపు నిధులు మంజూరు చేస్తామన్నారు. ఓటు హక్కు వినియోగించుకుంటే రోడ్లు వేస్తామని గత ఎన్నికల్లో తమలం, కొరజంగి, కంచురాయి, మెట్టగూడ గ్రామాల గిరిజనులకు హామీ ఇచ్చారు. ఈ మేరకు రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని హామీ పీవో సూచించారు. చక్రకాయపుట్టు నుంచి గండలం గ్రామానికి రోడ్డు ఏర్పాటుచేస్తామన్నారు. తమలం గ్రామం వద్ద 18 మీటర్ల కల్వర్టు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. అనంతరం తమలం ఎంపీపీ పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల పఠన సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుడు షేక్ హజారుద్దీన్‌ను పీవో అభినందించారు. పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని గ్రామస్తులు పీవోను కోరారు. ఇందుకు పీవో సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ డీఈ ధ్రువకుమార్, ఏఈఈ రాము, జామిగూడ సర్పంచ్ వెంకటరావు, గిన్నెలకోట ఎంపీటీసీ తదితరులు పాల్గొన్నారు.

కారు దగ్ధం కేసులో ముగ్గురి అరెస్టు

- టేకు కలప అక్రమంగా తరలింపు
- కారులో పెట్రోల్ లీక్
- సిగరెట్ వెలిగించడంతో మంటలు
- చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా



వివరాలు వెల్లడిస్తున్న చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా

చింతూరు: మండలంలోని సరివెల వద్ద జాతీయ రహదారిపై ఈనెల 10న జరిగిన కారు దగ్ధం ఘటనలో ముగ్గురిని అరెస్టు చేసినట్లు చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా తెలిపారు. గురువారం స్థానిక ఏఎస్పీ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ ఘటనతో మావోయిస్టులకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఎటపాక మండలం నెల్లిపాకకు చెందిన మనోజ్‌కుమార్, గణేష్ చింతూరు మండలం పేగకు చెందిన నాగయ్యతో కలసి కారులో టేకు కలప అక్రమ రవాణాకు పాల్పడినట్లు ఆయన తెలిపారు. కలప తరలిస్తున్న క్రమంలో వారు ప్రయాణిస్తున్న కారులో ఉంచిన పెట్రోల్ లీకైందని, దానిని గమనించకుండా వారు సిగరెట్ వెలిగించారన్నారు. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి కారు దగ్ధమైందని, ఈ ఘటనలో మనోజ్ ముఖంపై గాయాలైనట్లు ఏఎస్పీ తెలిపారు. కారు నెంబరు ప్లేటు కాలిపోవడంతో ఇంజిన్, చాసీ నంబర్ల ఆధారంగా నిందితుల కూపీ లాగినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

'వంజంగి' రమణీయం



వంజంగి హిల్స్‌లో గురువారం సూర్యోదయం వేళ అద్భుత దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి. సప్తవర్ణాల్లో భానుడి కిరణాలు, శ్వేత వర్ణంలో మేఘాలు కనువిందు చేశాయి. ఉదయం ఐదు నుంచి 8 గంటల వరకు ఈ అందాలను సందర్శకులు తనివితీరా వీక్షించారు.

– సాక్షి, పాడేరు

గుమ్మా ఘాట్ వద్ద బైక్, వ్యాన్ ఢీ

- ఇద్దరు మేస్త్రిలకు తీవ్ర గాయాలు
- పరిస్థితి విషమం, పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలింపు



గుమ్మాఘాట్‌లో ప్రమాదవశాత్తు వ్యాన్ కిందకు వెళ్లిన బైక్



చేతి విరిగిన మేస్త్రి పాదలంను ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రం నుంచి జోలా పుట్టు వెళ్లే మార్గంలో గుమ్మాఘాట్‌లో గురువారం సాయంత్రం బైక్, వ్యాన్ ఢీ కొన్నాయి. దీంతో బైకుపై వస్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలో సుజనకోట పంచాయతీ సుజనపేట గ్రామానికి చెందిన పాదలం, చిన్నారావు మేస్త్రి పనులు చేస్తూ జీవనం సాగిస్తూ ఉంటారు. అందులో భాగంగా పనసపుట్టు పంచాయతీ లుక్కురు గ్రామంలో ఇళ్ల నిర్మాణ పనులు చేసి సాయంత్రం ఇద్దరు బైకుపై ముంచంగిపుట్టు వైపు వస్తుండగా, అదే సమయంలో గుమ్మాఘాట్ సమీపంలో ఒంటి పుట్టు మలుపు వద్ద కడుగుల గ్రామానికి చెందిన వ్యాన్ ప్రధాన మార్గంలోకి వచ్చింది. ఈ రెండు బలంగా ఢీకొన్నాయి. బైకు వ్యాను కిందకు వెళ్లిపోయింది. బైక్‌పై ప్రయాణిస్తున్న మేస్త్రిలు పాదలం, చిన్నారావులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని స్థానికులు హుటాహుటిన ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తరలించారు. స్థానిక వైద్యాధికారి గీతాంజలి ప్రథమ చికిత్స అందించారు. పాదలం చేతి విరిగిపోగా, చిన్నారావు తల, కాళ్లపై గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న సుజనకోట సర్పంచ్ రమేష్, భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు రవికుమార్ సీహెచ్‌సీకి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. మేస్త్రిలకు తీవ్ర గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్య సేవలు నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.



తీవ్ర గాయాలతో మేస్త్రి చిన్నారావు

సిరులతల్లికి నీరాజనం

- వైభవంగా రెండో గురువారం పూజలు
- కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



పంచామృతాభిషేక సేవలో ఆలయ ఈవో శోభారాణి, ఏఈవో తిరుమలేశ్వరరావు



టౌన్‌కొత్తరోడ్డు వరకు అమ్మవారి దర్శనానికి క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, సిరులతల్లి శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా రెండో గురువారం పూజలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. వేదమంత్రాలు, నాదస్వరాల మధ్య గణపతి పూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వరణం, వేద పారాయణాలు, శ్రీచక్రార్చన లక్ష్మీహోమం, విశేష పూజలు చేశారు. పసుపు కుంకుమ నీళ్లతో అమ్మవారికి అభిషేకం జరిపారు. అనంతరం అమ్మవారికి స్వర్ణాభరణ అలంకరణ చేసి బుధవారం అర్ధరాత్రి 12.05 నుంచి 1.30 గంటల వరకు భక్తులక్కు దర్శన భాగ్యం కల్పించారు. వెండి కవచం తొడిగారు. పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి కె. శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది, పోలీస్ శాఖ, రెవెన్యూ, దేవదాయ ధర్మాదాయశాఖ ఉద్యోగులు, జీవీఎంసీ సిబ్బంది అమ్మవారి సేవలో పునీతులయ్యారు. గురువారం రాత్రి వరకు 40 వేలమందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఐదు వేల మందికి అన్నదానం

మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా టౌన్‌కొత్తరోడ్డు జగన్నాథస్వామి ఆలయ ప్రాంగణంలో రెండో గురువారం ఐదు వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. అన్నదాన కార్యక్రమానికి భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రాంగణంలో సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

దర్శన క్యూలైన్లు ఇలా..

టౌన్‌కొత్తరోడ్డు నుంచి క్యూలైన్లు ఏర్పాటు చేశారు. రీడింగ్ రూమ్ వద్ద ధర్మదర్శనంతోపాటు రూ.100, రూ.200 క్యూలైన్ల టికెట్లు అక్కడే అందజేశారు. సీతారామస్వామి ఆలయం వైపు నుంచి వీవీఐపీ, వీఐపీతో పాటు వృద్ధులు, దివ్యాంగులు, రూ.200, రూ.500 టికెట్ తీసుకున్న వారికి దర్శనం కల్పించారు. అమ్మవారి ఆలయ వెనుక భాగం, ఆలయ ప్రధాన ద్వారం (వీటి కాలేజ్ వద్ద), దర్శనం అనంతరం బయటకు వచ్చే మార్గంలో ప్రసాద కౌంటర్లు ఏర్పాటు చేశారు. అమ్మవారి ఆలయ సమీపంలో పోలీస్ అవుట్‌పోస్ట్‌తో పాటు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ మంచినీటి సదుపాయం కల్పించారు. పలు స్వచ్ఛంద సంస్థలు ఉచిత ప్రసాదం, మజ్జిగ అందజేశాయి. టౌన్‌కొత్తరోడ్డు, ఘోషాస్పత్రి, అమ్మవారి ఆలయం వెనుక భాగంలో చెప్పుల స్టాండ్ ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా పోలీసులు బందోబస్త్ ఏర్పాటు చేశారు. ఆలయం వెనుక భాగం ద్వారా వృద్ధులు, దివ్యాంగులకు ఎన్‌క్లేవ్ ఏర్పాటు చేశారు. అమ్మవారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో క్యూలైన్లు టౌన్‌కొత్తరోడ్డు దాటి జగన్నాథస్వామి ఆలయం కొనసాగాయి.

ట్రాఫిక్ మళ్లింపు..

భక్తుల రద్దీ దృష్ట్యా జగదాంబ జంక్షన్ మీదుగా పాత పోస్టాఫీస్ వెళ్లే వాహనాలను టౌన్‌కొత్తరోడ్డు వద్ద కుడివైపు తిరిగి సూయిజ్‌ఫాం ముందు రోడ్డు నుంచి కురుపాం మార్కెట్ మీదుగా ట్రాఫిక్ మళ్లించారు. కాన్వెంట్ జంక్షన్, అద్వానీ జంక్షన్, రామకృష్ణ జంక్షన్ మీదుగ వాహనాలతో వచ్చే వారిని సీహార్స్ జంక్షన్ నుంచి ఎడమవైపునకు తిరిగి గోపాల్ ఆటో జంక్షన్ మీదుగా వాహనాలు మళ్లించారు.

బాలికపై లైంగిక దాడి

బీచ్‌రోడ్డు: బాలికను మాయమాటలతో నమ్మించి, అత్యాచారానికి పాల్పడ్డ యువకుడిపై, బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మూడవ పట్టణ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి సీఐ రమణయ్య అందించిన వివరాలు. చినవాల్తేరు ప్రాంతానికి చెందిన పి.ధనేష్(20) కొంతకాలంగా అదే ప్రాంతానికి చెందిన బాధిత బాలికను రోజూ వెంబడిస్తూ, వేధిస్తున్నాడు. వివాహం చేసుకుంటానని నమ్మించి అత్యాచారం చేశాడు. ఆ తర్వాత కూడా వేధింపులకు పాల్పడటంతో విషయం కుటుంబ సభ్యులకు తెలిసింది. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ముగిసిన గిరిజన యువజన సమ్మేళనం



సర్టిఫికెట్లతో విజేతలు

కొమ్మాది: గీతం విశ్వవిద్యాలయం వేదికగా వారం రోజుల పాటు నిర్వహించిన 16వ జాతీయ గిరిజన యువజన సమ్మేళనం గురువారం ముగిసింది. ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన 5 జిల్లాల నుంచి 200 మంది ఆదివాసీ యువత సమ్మేళనంలో పాల్గొంది. ఇందులో భాగంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో యువ కేంద్ర సంఘటన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంచాలకులు అన్షుమన్ దాస్, హోం మంత్రిత్వ శాఖ సెక్షన్ ఆఫీసర్ దినేష్ కుమార్ మీనా తదితరులు పాల్గొన్నారు.

బొర్రా అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- పాడేరు సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, సర్పంచ్, ఎంపీటీసీ, పాలకవర్గ సభ్యులు

అనంతగిరి (అరకులోయ టౌన్): మండలంలోని బొర్రా పంచాయతీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పాడేరు సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్ వెల్లడించారు. గురువారం ఆయన బొర్రా పంచాయతీలో వివిధ అభివృద్ధి పనులు, పర్యాటక, భూసమస్యలపై ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పీసా కమిటీ సభ్యులు, వార్డు సభ్యులు, గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జన్ని అప్పారావు, ఎంపీటీసీ కురిసెల అరుణ మాట్లాడుతూ జిప్ లైన్, బొర్రా గుహల ఆదాయం నుంచి బొర్రా పంచాయతీ వాటాను పర్యాటకశాఖ అధికారులు చెల్లించడం లేదన్నారు. దీనివల్ల పంచాయతీ అభివృద్ధి కుంటుపడుతోందన్నారు. వాహనాల పార్కింగ్‌ను గతంలో మాదిరిగా పంచాయతీకి అప్పగించాలని కోరారు. బొర్రా పంచాయతీలో చాలా మందికి ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు లేనందున తీవ్ర నష్టపోతున్నారని, వారికి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. స్వదేశీ యాత్ర 2.0లో భాగంగా అనంతగిరి మండలంలోని బొర్రా గుహలు ఎంపికైనందున, దీంతో పాటు స్థానిక ప్రాజెక్ట్‌ల్లో కూడా స్థానిక గిరిజనులకు మాత్రమే ఉద్యోగాలు కల్పించాలని కోరారు. వీటన్నింటిని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. త్వరలో నిర్వహించనున్న జిల్లా కౌన్సిల్ సమావేశంలో చర్చించి దీనిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఏర్పాటు చేసే ప్రాజెక్టుల్లో వంద శాతం ఉద్యోగాలు గిరిజనులకు కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీవో, డీఎల్పీవో పీఎస్ కుమార్, ఎంపీడీవో ఏవీవీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇరుముడులతో మాలధారుల పయనం



ఇరుముడులు ధరించి బయలుదేరిన మాలధారులు

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగిలోని భ్రమరాంబికామల్లిఖార్జునస్వామి వారి ఆలయంలో మాలధారులు ఇరుముడులు ధరించారు. తొలుత శ్రీశైలం వెళ్లి దీక్ష విరమించిన అనంతరం అరుణాచలం, శ్రీకాళహస్తి, కంచి తదితర పుణ్యక్షేత్రాలు దర్శించనున్నట్టు మాలధారులు తెలిపారు.

గంగవరం: స్థానిక రామాలయంలో అయ్యప్ప మాలధారుల ఇరుముడి కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. గురుస్వాములు వాడపల్లి శేషాచార్యులు, పావాడ నాగూరుస్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సర్పంచ్ కలుముల అక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

జనవరి 10న అప్పన్న వైకుంఠద్వార దర్శనం

సింహాచలం: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని వచ్చే నెల 10న సింహాచల శ్రీవరాహ లక్ష్మీనసింహస్వామి వైకుంఠద్వార దర్శనం ఉత్సవాన్ని విశేషంగా నిర్వహించనున్నట్టు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై సింహాచలం దేవస్థానం సెక్షన్ హెడ్‌లతో ఈవో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారి వైకుంఠద్వార దర్శనం ఉత్సవంలో సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తున్నట్టు తెలిపారు.

రెండు వేర్వేరు కేసుల్లో 215 కిలోల గంజాయి పట్టివేత

- బంగారంపేటలో ఇద్దరు, కాకరపాడులో ముగ్గురు అరెస్ట్
- క్యారియర్ వాహనం, రెండు బైక్‌లు స్వాధీనం
- అశోక్ లేలెండ్ గూడ్స్ క్యారియర్, డు బైక్‌లు స్వాధీనం



పట్టుబడిన గంజాయి, అరెస్టు చేసిన వారితో పోలీసులు

కొయ్యూరు: రెండు వేర్వేరు కేసుల్లో 215 కిలోల గంజాయిని కొయ్యూరు పోలీసులు స్వాధీనం చేసుకుని ఐదుగురిని అరెస్ట్ చేశారు. ఈ మేరకు రంపుల నుంచి తూర్పుగోదావరి జిల్లా రౌతులపూడికి ద్విచక్ర వాహనంపై 13 కిలోల గంజాయి తరలిస్తుండగా బంగారంపేట సమీపంలో పట్టుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ కిషోర్‌వర్మ గురువారం సాయంత్రం తెలిపారు. మరో కేసులో 202 కిలోల గంజాయిని పెదవలస నుంచి ఏలేశ్వరంనకు క్యారియర్ వాహనంలో తరలిస్తుండగా కాకరపాడులో పట్టుకున్నట్టు చెప్పారు. వారి నుంచి రెండు బైక్‌లను, గూడ్స్ క్యారియర్‌ను స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్ట్ చేశామన్నారు. కాకరపాడు, బూదరాళ్ల రహదారులపై నిఘాను ముమ్మరం చేశామన్నారు. గిరిజన యువత గంజాయి కేసుల్లో ఇరుక్కుని జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు.

టెండరు ప్రకటన

అల్లూరి సీతారామరాజు జిల్లా, ఐ.టి.డి.ఎ., రంపచోడవరం పరిధిలోగల ఆశ్రమ పాఠశాలలకు, వసతి గృహములకు, గురుకుల పాఠశాలలు మరియు ఏకలవ్య పాఠశాలలు మరియు కళాశాలలకు టెండరు ప్రక్రియ ద్వారా కూరగాయలు, పండ్లు, చికెన్ మరియు గుడ్లు సరఫరా చేయుటకు టెండర్లు కోరబడుచున్నవి. ... సంయుక్త గురుకులం సెల్, ఐ.టి.డి.ఎ., రంపచోడవరం వారి కార్యాలయము నుండి ఒక్కొక్క టెండరుకు రూ.500/- నగదు చెల్లించి టెండరు షెడ్యూలును తేది: 13.12.2024 నుండి 21.12.2024 ఉదయం 10.00 గంటల వరకు పొందవచ్చును. పూర్తి చేసిన టెండరు షెడ్యూల్ను ది:21.12.2024 తేది ఉదయము 11.00 గంటల లోపు ఉపసంచాలకులు(గి.సం)/గురుకులం సెల్, ఐ.టి.డి.ఎ., రంపచోడవరం వారి కార్యాలయము నందు ఉంచబడిన టెండరు బాక్సులో వేయవలెను. అదే రోజు తేది: 21.12.2024 ఉదయం 11.00 గంటలకు టెండరు దారుల సమక్షములో సీల్డు చేసిన టెండర్లు తెరవబడును. పూర్తి వివరములకు ఉప సంచాలకులు(గి.సం), ఐ.టి.డి.ఎ., రంపచోడవరం వారి కార్యాలయములో సంప్రదించవలెను.

పథక నిర్వహణాధికారి, ఐ.టి.డి.ఎ., రంపచోడవరం అల్లూరి సీతారామ రాజు జిల్లా

గిరిజన రైతుల్లో గుబులు


- ఆకాశంలో కమ్ముకున్న మేఘాలు
- వడివడిగా కోత పనుల్లో నిమగ్నం

రాజవొమ్మంగి: ఆరుగాలం శ్రమించి పండించిన పంట పక్వానికి వచ్చి కోతకు సిద్ధంగా ఉండగా, ఆకాశం మేఘావృతమై వర్షం కురిసే సూచనలు కనిపిస్తుండడంతో తన పంట ఏమౌతుందోనని గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారు. రాజవొమ్మంగి మండల వ్యాప్తంగా 6వేల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగవుతోంది. ప్రస్తుతం పంట పక్వానికి వచ్చిన తరుణంలో తుపాను హెచ్చరికలతో ఎప్పుడు ఏంమౌతోందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒకవేళ అధిక వర్షాలు కురిస్తే పంటపొలాల్లోకి చొచ్చుకొని వచ్చే నీరు ఎప్పటి కప్పుడు దిగువకు మళ్లించేందుకు, పండిన పంటను ముంపుబారి నుంచి కాపాడుకొనేందుకు రైతులు పంట రక్షణ పనులు చేపడుతున్నారు.

సబ్ డివిజన్‌లో 16వేల ఎకరాల్లో వరి పంట

అడ్డతీగల సబ్ డివిజన్‌లోని రాజవొమ్మంగి, అడ్డతీగల, వై.రామవరం, గంగవరం మండలాల్లో ఈ ఖరీఫ్‌లో సుమారు 16వేల ఎకరాల్లో రైతులు వరి సాగుచేస్తున్నట్లు ఏడీఏ కె.సావిత్రి అన్నారు. ఎకరాకు 1.8 టన్నుల చొప్పున దాదాపు 30 వేల టన్నుల ధాన్యం దిగుబడిని అంచనా వేస్తున్నామన్నారు. ఇప్పటికే నాలుగు మండలాల్లో 40 శాతం కోతలు పూర్తయినట్టు ఆమె తెలిపారు. ఏజెన్సీలో ప్రస్తుతం తుపాను ప్రభావం లేదని రైతులు ఆందోళన చెందవద్దన్నారు. వడి వడిగా కోతలు పూర్తి చేసి పంటను ఒబ్బిడి చేసుకోవాలని రైతులకు సూచించారు. అదే విధంగా ప్రతి మండలంలో ఇప్పటికే ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే పండిన పంటను విక్రయించుకోవాని సూచించారు. విక్రయించినధాన్యానికి రెండు రోజుల్లోనే వారి వారి బ్యాంకు ఖాతాలకు సొమ్ము జమ అవుతుందన్నారు.

శ్వాస అందక మూడు నెలల పసికందు మృతి



మృతి చెందిన చిన్నారి

చింతపల్లి; మూడు నెలల చిన్నారి శ్వాస అందక మృతి చెందిన సంఘటన బుధవారం అర్ధరాత్రి చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో చోటు చేసుకుంది. కుటుంబీకులు అందించిన వివరాలిలా ఉన్నాయి. కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన వంజరి ఈశ్వరి, గణపతి దంపతుల మూడు నెలల పాపకు గతంలో రెండుసార్లు వ్యాక్సిన్ వేశారు. బుధవారం మరోమారు అంగన్‌వాడీ కేంద్రంలో వ్యాక్సిన్ వేశారు. దీంతో చిన్నారికి జ్వరం సోకింది. వెంటనే చిన్నారి తండ్రి ఏఎన్‌ఎంకి ఫోన్ చేసి విషయాన్ని తెలియజేయగా వాక్సిన్ తరువాత జ్వరం రావడం సహజమని ఆమె చెప్పారు.అయితే సాయంత్రానికి జ్వరం తీవ్రత అధికమై శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడడంతో గాలి సోకిందని భావించి సంప్రదాయ పద్ధతిలో దిష్టి తీసి వైద్య సేవలు చేశారన్నారు.శిశువు ఆరోగ్య పరిస్థితి విషమించడంతో రాత్రి 8 గంటలు దాటిన తరువాత చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తీసుకువచ్చారు.అప్పటికే ఆ శిశువు శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతుంది.ఆ సుపత్రి వైద్యులు వెంటనే పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించారు. పరిస్థితి విషమంచడంతో మెరుగైన వైద్య సేవలకు విశాఖ కేజీహెచ్‌కు తరలించడానికి ఏర్పాట్లు చేశారు.అప్పటికే ఆ పసికందు మృతి చెందింది.దీంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

సుస్థిర పాలనపై అవగాహన



మాట్లాడుతున్న డీఎల్‌పీవో కుమార్

అనంతగిరి(అరకులోయ టౌన్): సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు ప్రజలకు చేరువ చేసేందుకు ప్రతీ ఒక్క ఉద్యోగి, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని డీఎల్‌పీవో పి.ఎస్.కుమార్ చెప్పారు. మండలంలో జరిగిన సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది శిక్షణ కార్యక్రమానికి ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామస్థాయిలో ప్రజలకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన కల్పించి, తద్వారా గ్రామాల అభివృద్ధికి తోడ్పాలని సూచించారు. అధికారులు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అరకులోయటౌన్: అరకులోయ మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవో అడపా లవరాజు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బందికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

రిజర్వేషన్లు పక్కాగా అమలు చేయాలని వినతి



చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్‌కు వినతిపత్రం అందజేస్తున్న పరిషత్ నాయకులు

చింతూరు: షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని ఆదివాసీలకు రిజర్వేషన్లు పక్కాగా అమలు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బంగారు వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆదివాసీ నిరుద్యోగ యువత స్థానిక ఐటీడీఏ ఎదుట చేపట్టిన 72 గంటల నిరాహార దీక్షలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిమ తెగల భాష, సంస్కృతి, సంప్రదాయాలు విభిన్నమైనవని, వెనుకబడిన ఈ తెగకు రాజ్యాంగంలో ప్రత్యేక చట్టాలు హక్కులు కల్పించబడ్డాయన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతంలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో స్థానిక ఆదివాసీలకు ఉద్యోగాలు కల్పించాలని, ఇందుకోసం ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని కోరారు. అనంతరం ఐటీడీఏ పీవో అపూర్వభరత్‌కు పరిషత్ నాయకులు వినతిపత్రం అందచేశారు. చినవీరభద్రం, వీరయ్య, దుర్గారెడ్డి, శ్రీను, రాఘవయ్య, ప్రసాద్, లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఉచిత ఉపాధి శిక్షణకు దరఖాస్తులు

మహారాణిపేట: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(నేక్) ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం స్మార్ట్ ఎనర్జీ మీటర్ టెక్నీషియన్‌గా ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు నేక్ అసిస్టెంటు డైరెక్టర్ ఎస్‌వీఎస్ రవికుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్/ఐటీఐ/డిప్లమో ఉత్తీర్ణత కలిగిన వారికి ఈ కోర్సులో మూడు నెలల కాలంలో శిక్షణ అందిస్తామన్నారు. శిక్షణ అనంతరం ప్రైవేట్ రంగంలో ఉపాధి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు 8309003957 నంబర్లో సంప్రదించాల్సిందిగా కోరారు.

సమస్యలు పరిష్కరించడంలో విఫలం

- అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు శేషాద్రి
- కూటమి ప్రభుత్వంపై విమర్శ



దీక్షా శిబిరంలో గురుకులం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

పాడేరు రూరల్ (అరకులోయ రూరల్): గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శేషాద్రి విమర్శించారు. గురువారం ఆయన ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల రిలే దీక్షలో పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా శేషాద్రి మాట్లాడుతూ గురుకులాలు, పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న ఉద్యోగులపై కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. నిరసన చేపట్టి దాదాపుగా 27 రోజులు గడుస్తున్నా పట్టనట్టు వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. జీవో నంబర్-3కు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ఈశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న రాజశేఖర్, పక్కన విద్యార్థి సంఘం నాయకులు

పాడేరు రూరల్(అరకులోయ రూరల్): పెదబయలు మండలం గోమంగి గురుకులం పాఠశాలలో విషాహారం తిని ఆస్పత్రి పాలైన విద్యార్థుల సంఘటనలో పాఠశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతు విద్యార్థు పట్ల పూర్తి నిర్లక్ష్యం చేసిన ప్రిన్సిపాల్‌పై అధికారులు, యంత్రాంగం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం పిలుపుతో పేరెంట్స్ సమావేశంలో మిగిలిపోయిన భోజనాలను పారేయకుండా మరుసటి రోజు విద్యార్థులకు ఇవ్వడం వల్ల ఈ ఘటన జరిగిందని ఆరోపించారు. దీనిపై తక్షణమే ప్రిన్సిపాల్‌ని సస్పెండ్ చేయాలని లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. విద్యార్థి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దీక్షాధారులతో పులకించిన సింహగిరి



కార్యక్రమంలో పాల్గొన్న మాలధారులు

సింహాచలం: నృసింహ దీక్షాధారులతో సింహగిరి పులకించింది. ఈ నెల 2వ తేదీన 41 రోజులపాటు దీక్షలు ప్రారంభం కాగా..గురువారంమరికొందరు భక్తులు 32 రోజుల పాటు దీక్ష ధరించారు. సింహగిరికి వచ్చిన సుమారు ఎనిమిదివందల దీక్షాధారులకు ఉదయం సింహాచలం దేవస్థానం అర్చకులు శాస్త్రోక్తంగా మాలధారణ చేశారు. ఆలయ రాజగోపురం పక్కన మాడవీధిలో ప్రత్యేకంగా వేదిక ఏర్పాటు చేసి వరాహ లక్ష్మీనృసింహస్వామి ప్రతిమను ఉంచారు. దేవస్థానం ఈవో వి.త్రినాథరావు, అర్చకులు, అధికారులు మేళతాళాలు, వేద మంత్రోశ్చరణల మధ్య ఆలయంలోంచి తులసి మాలలను ఊరేగింపుగా వేదిక వద్దకు తీసుకొచ్చారు. స్వామి చెంతన తులసి మాలలను ఉంచి అర్చకులు విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. స్వామివారి అష్టోత్తర శతనామావళిని దీక్షాధారులందరిచేత పఠింపజేశారు. అనంతరం దీక్షాధారులకు మాలధారణ చేశారు. దీక్షానియమాలను వివరించారు. స్వామివారి తులసి మాలలను, ప్రతిమలను ఉచితంగా అందజేశారు. స్వామివారి దర్శనాన్ని ఉచితంగా కల్పించారు. అన్నప్రసాద భవనంలో దీక్షధారులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. దేవస్థానం బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని కల్పించారు. దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, ఉప ప్రధానార్చకుడు ప్రసాదాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. చందన పెరుమాళ్ల పీఠం గురుస్వామి సానబోయిన రాజు పాల్గొన్నారు. ఏఈవో ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ త్రిమూర్తులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. జనవరి 12వ తేదీన దీక్షవిరమణ ఉంటుందని దేవస్థానం ఈవో ప్రకటించారు. ఆరోజు దీక్షా విరమణ, శాంతి కల్యాణం కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నామన్నారు.